మంగళవారం సాయంత్రం నూతన కోర్టులోని జడ్జి ఛాంబర్‌లో జిల్లా జడ్జి ఈ.భీమారావుని మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్ సుమిత్ కుమార్

రూ.164లకే నాణ్యమైన కందిపప్పు

రైతు బజార్‌లో స్టాల్‌ను ప్రారంభించిన జెసి శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖ సమన్వయంతో రైతు బజార్లలో రూ.165లకే నాణ్యమైన కందిపప్పు అందించడం జరుగుతున్నదని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరులోని రైతు బజార్‌లో రూ.165లకు కందిపప్పు విక్రయ కేంద్రంను జేసి ప్రారంభించారు. రైతు బజార్‌తో పాటు చిత్తూరు పట్టణంలోని చర్చి వీధిలోని వినాయక స్టోర్స్‌లో కూడా ఈ విక్రయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసి విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కందిపప్పు ఉత్పత్తి, సరఫరా తక్కువగా ఉన్నందున డిమాండ్ పెరగడంతో మార్కెట్‌లో ఒక కేజీ కందిపప్పు రూ.175ల నుండి రూ.200లు ధర పలుకుతున్నదన్నారు. అధిక ధర వెచ్చించి సామాన్యులు కొనుగోలు చేయలేరనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా రూ.165ల కే నాణ్యమైన కందిపప్పును ప్రజలకు అందించాలని నిర్ణయించిందన్నారు. చిత్తూరులో పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్‌శాఖ సమన్వయంతో రైతు బజార్‌లో ఒక స్టాల్ ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించడం జరిగిందన్నారు. టమోటా కూడా అధిక ధర పలుకుతున్న నేపథ్యంలో తక్కువ ధరకు మొబైలు వాహనాల ద్వారా విక్రయాలు చేపట్టడం జరిగిందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు బజార్‌లో విక్రయాలు జరుపుకొనుటకు చిరువ్యాపారులకు ఉచితంగా కేటాయిస్తున్నామని, చిత్తూరు పట్టణంలో ప్లాట్ ఫారం పైన, రోడ్లపై కాయగూరల అమ్మకాలు జరుగుతున్నాయని, అలాంటి వారికి రైతు బజార్‌లో ఖాళీగా ఉన్న స్టాల్స్‌ను కేటాయించేలా నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. రైతు బజార్‌లో గతంలో మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, టమోటాలు అమ్మేవారని తెలిపారు. రైతు బజార్‌లో విక్రయాలపై ప్రజలలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

మొబైల్ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ తనిఖీ చేసిన జేసి

అనంతరం పట్టణ పరిధిలోని గంగనపల్లిలో ఎఫ్ షాప్ నెం:30 పరిధిలో ఎఫ్‌పి మొబైలు వాహనం ద్వారా రేషన్ పంపిణీని జేసి ఆకస్మిక తనిఖీ చేశారు. మొబైలు వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్న నిత్యావసరాల నాణ్యత, పరిమాణాలను పరిశీలించి రేషన్ కార్డుదారులతో మాట్లాడారు. ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఖచ్చితమైన కొలతలతో కార్డుదారులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని, ఎటువంటి వ్యత్యాసం ఉండరాదని జెసి ఆదేశించారు. కార్యక్రమంలో డిఎస్‌ఓ శంకరన్, ఏడి మార్కెటింగ్ పరమేశ్వరన్, తహశీల్దార్ శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ, వెటర్నరీ డిప్లమా కోర్సులకు

మంచి ఉపాధి అవకాశాలు : కలెక్టర్

సదుంలో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- సదుం

వ్యవసాయ, వెటర్నరీ డిప్లమా కోర్సులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా చౌడేపల్లిలో వ్యవసాయ పాలిటెక్నిక్, సదుంలో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్వరితగతిన ఉపాధి అవకాశాలు పొందేందుకు వ్యవసాయ, వెటర్నరీ డిప్లమా కోర్సులు తోడ్పడతాయన్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు ద్వారా చాలా మంది విద్యార్థులకు వ్యవసాయ, పశు ఆధారిత రంగాల పై ఆసక్తి ఉన్న వారందరూ ఈ కోర్సులను పూర్తి చేసి ఉపాధి అవకాశాలను ఏర్పరచుకోగలరన్నారు. భవన నిర్మాణ పనులను నాణ్యతాతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల నిర్మాణ పనులు ఇప్పటి వరకు 40శాతం పూర్తి అయ్యాయని కార్పొరేట్ సోషల్ రెస్పాంసబిలిటీ ఫండ్ కింద కళాశాల నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని ఏపిఇడబ్ల్యూఐడిసి ఈఈ శివ ప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖలలోని

ఎన్ఎంఆర్ జీతాల పెంపు : డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

2024- 2025 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ విభాగాలలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్, మజ్దూర్ కార్మికుల వేతనాలను పెంచుతూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో ప్రభుత్వశాఖలలోని ఎన్ఎంఆర్, మజ్దూర్ కార్మికుల వేతనాల పెంపుపై జిల్లా కార్మికశాఖ ఇంచార్జి కే.ఓంకార్‌రావుతో కలసి డిఆర్ఓ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు ప్రకారం 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి గాను 2024 ఏప్రిల్ 1వ తేదీ నుండి ప్రభుత్వ విభాగాలలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్, మజ్దూర్ కార్మికుల వేతనాల పెంచుతూ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన వేతనంపై ఐదుశాతం పెంచి చెల్లించే విధంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం మేరకు గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న నైపుణ్యం లేని కార్మికులకు రోజుకి రూ.538లు, మున్సిపాలిటీలో వారికి రూ.621లు కార్పొరేషన్‌లు వారికి రూ.678లుగా నిర్ణయించినట్లు తెలిపారు. అర్ధనైపుణ్యం గల వారికి గ్రామీణ ప్రాంతాలలో రోజుకు రూ.565లు, మున్సిపాలిటీలలో రూ.652లు, కార్పొరేషన్‌లలో రూ.712లు. నైపుణ్యం గల వారికి గ్రామీణ ప్రాంతాలలో రోజుకు రూ.594లు మున్సిపాలిటీలలో రూ.685లు, కార్పొరేషన్లో రూ.749లుగా వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. పెంచిన వేతనాలు ఏప్రిల్ నుండి అమలులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి ఎన్.రాజశేఖర్, ఆర్అండ్ బి ఎస్ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, పిఆర్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, కుప్పం ఆర్‌డిఓ శ్రీనివాసులు, సహాయకార్మిక అధికారి జగదీశ్ బాబు, కాణిపాకం దేవస్థానం సహాయ కార్యనిర్వహణ అధికారి రవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలను అమలు పరచాలి: ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

కొత్త చట్టాలను ప్రతి పోలీసుస్టేషన్‌లో అమలు చేయాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో మంగళవారం ఎస్పీ జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారీ నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసింగ్ స్కిల్స్, విజిబుల్ పోలీసింగ్ పెంచే విధంగా పనిచేయాలని, ప్రజలతో సామరస్యంగా, సఖ్యతతో చట్టంపై గౌరవం పెంపొందేటట్లు మెలగాలని సూచించారు. ఎర్రచందనం, నాటుసారా, ఇసుక అక్రమ రవాణ నేరస్తులపై ఉక్కుపాదం మోపాలని, పిడి యాక్ట్‌లు ప్రయోగించాలన్నారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ద వహించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రతి గ్రామంలో పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచాలన్నారు. రోడ్డు ప్రమాదాలు మరింత తగ్గే విధంగా నివారణకు మెరుగైన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్ఫోర్స్మెంట్ పెంచి చట్ట వ్యతిరేక, అసాంఘీక కార్యక్రమాల అడ్డుకట్ట వెయ్యాలని, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళా పోలీసులచే మహిళలకు విద్యార్థినులకు సమాజంలో జరిగే నేరాలపట్ల, సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించి వారిని చైతన్య పరచాలన్నారు. అలాగే బీట్ వ్యవస్థ శాంతి భద్రతల పరిరక్షణ చేస్తూ, నేర నివారణ చేయాలని, పగలు, రాత్రి బీట్ సిస్టంను మరింత బలోపేతం చేయాలన్నారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, డెకాయిటి, రాబరీ, ప్రాపర్టీ వాహనాలు దొంగతనం, 174 సిఆర్‌పిసి కేసులు, మిస్సింగ్, చీటింగ్, 102 సిఆర్‌పిసి ఐటి యాక్ట్ కేసులు, సైబర్ నేరాలు, ఇతర కేసులను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డ్సను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ఛేదింపునకు మరియు పరిష్కారానికి, నేరనియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు మరియు మెళకువలను అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. కేసు నమోదు అయిన తర్వాత కోర్టులో నిందితులకు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్నప్పుడే బాధితులకు సరైన న్యాయం చేసినట్లు అవుతుందని పోలీస్ అధికారులకు సూచించారు. ఏదైనా దొంగతనం జరిగిన వెంటనే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, నేరస్తుడు వదిలిన సాక్ష్యాధారాలు, సిసి కెమెరాల ఫుటేజీలను క్రోడీకరించి ముద్దాయిలను పట్టుకొని, వారి వద్ద నుండి పూరి మొత్తంలో దొంగిలించబడిన సొమ్ము రికవరీ చేయాలన్నారు.

నడక మార్గం భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత

టీటీడీ ఈవో జె.శ్యామలరావు

ప్రజాశక్తి- తిరుమల: అలిపిరి, శ్రీవారి మెట్టు నడకమార్గంలో వెళ్లే భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతి శ్రీపద్మావతి విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ అటవీ, టీటీడీ అటవీ, ఇంజనీరింగ్, భద్రత విభాగాలతో కాలిబాట భక్తుల భద్రత చర్యలపై ఈవో సమీక్షించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న ట్రాప్ కెమెరాలే కాకుండా చిరుతలు, ఇతర జంతువుల సంచారం తెలుసుకొనేందుకు మరిన్ని ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుండి ఏడవ మైల్ వరకు సంచరించే జంతువుల కదలికలు ఎప్పటికప్పుడు కంట్రోల్ రూంకు తెలిసేలా సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జంతువుల కదలికలపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు భద్రత విభాగానికి తెలియజేయడం ద్వారా భక్తులను హెచ్చరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సంయుక్త కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలు చాలా ఖర్చుతో కూడుకున్నవని సదరు కమిటీ వారికి తక్కువ ఖర్చుతో అయ్యే నిర్మాణాలను, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించవలసిందిగా వారికి ఉత్తరం రాయాలని అధికారులను ఆదేశించారు. కాలినడక మార్గంలో ఏఏ సమయాల్లో భక్తుల రాకపోకలు అధికంగా, తక్కువగా ఉన్నాయి, ఏఏ సమయాల్లో చిరుతలు ఈ ప్రాంతంలో తిరుగుతున్నాయి, తదితర సమాచారాన్ని అటవీ అధికారులు పీపీటీ ద్వారా తెలిపారు. ఇందుకు సంబంధించి కాలినడక భక్తులకు నిర్దేశించిన సమయాల్లోనే తిరుమలకు చేరుకునేలా, ఆ సమయాల్లో మార్పులు చేయవలసిందిగా ఈవో దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు సంబంధించిన అధికారులతో చర్చించి, తగు చర్యలు తీసుకోవాల్సిందిగా జేఈవో వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్వో నరసింహ కిషోర్‌కు సూచించారు. అంతకుముందు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంయుక్త కమిటీ ప్రతిపాదనలు, వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా వారిచ్చిన ప్రతిపాదనలను అటవీ విభాగం అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సంబంధిత ప్రతిపాదనలలో ఏఏ పనులు చేపట్టడం జరిగింది, ఎన్ని పురోగతిలో ఉన్నాయి, ఇంకెన్ని పనులు చేయవలసి ఉన్నాయి అనే అంశాలపై ఈవో సమీక్షించారు. ఎస్వి జూ పార్క్ క్యూ రేటర్ సెల్వం, తిరుపతి డిఎఫ్ఓ సతీష్, సబ్ డిఎఫ్ఓ శ్రీనివాస్, సిఈ నాగేశ్వరరావు, ఎస్ఈ 2 జగదీశ్వర్ రెడ్డి, టిటిడి డిఎఫ్ఓ శ్రీనివాస్, పంచాయతీ ప్రత్యేక అధికారి మల్లికార్జున్, ఆరోగ్య శాఖ అధికారి శ్రీదేవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

మినీ అంగన్‌వాడీ, సహాయకురాలు

పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నగరి ఐసీడీఎస్ పరిధిలోని నగరి మున్సిపాలిటీ, నింద్ర, విజయపురం మండలాలలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో కె.కృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరి మున్సిపాలిటీ టీఆర్ కండ్రిగ (ఓసీ), సత్రవాడ 1(బీసీబీ) అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు, నింద్ర మండలంలో కీళంబాకం దళితవాడ (ఓసీ), శ్రీరామపురం ఎస్టీ కాలనీ (ఎస్టీ) మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, కొప్పేడు దళితవాడ (ఎస్సీ), పాదిరి (ఓసీ) అంగన్‌వాడీ పోస్టులు, విజయపురం మండలంలో ఎల్లసముద్రం (బీసీ డి) మినీ అంగన్‌వాడీ కార్యకర్త, శ్రీహరిపురం (బీసీ డి) అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటికి ధరఖాస్తు చేసుకొను అభ్యర్థులు 10వ తరగతి పాసై స్థానిక వివాహిత మహిళ (ఆ ఊరి కోడలు) అయివుండాలన్నారు. వయస్సు జూలై 1వ తేదీకి 21 నుంచి 35 వయస్సు లోపల ఉండాలన్నారు. అభ్యర్థులు ధరఖాస్తుతో పాటు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్, రేషన్ కార్డు, కుల, నివాస ధృవీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేసి జతపరచాలన్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి 19వ తేదీ సాయంత్రం 5గంటల లోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ధరఖాస్తులు సమర్పించాలన్నారు.

ఏపీ సమగ్రాభివృద్ధికి సహకరించండి : ఎంపీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సహకరించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పార్లమెంట్ సమావేశాలలో పాల్గొంటున్న ప్రసాదరావు, కేంద్ర మంత్రిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కేంద్ర మంత్రికి వివరంగా తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాల ఆదుకోవాలని, ఏపిలో పరిశ్రమల (ఎంఎస్‌యంఈల) స్థాపన, ఆత్మనిర్భర్ పథకాల అమలుకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. అనంతరం ప్రసాదరావు మాట్లాడుతూ చిత్తూరు పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాల శాసనసభ్యుల సమన్వయంతో ముందుకు సాగుతూ అన్ని నియోజకవర్గాల అభ్యున్నతి కోసం పాటుపడతానని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అండగా ఉంటానన్నారు.

లాలీపాప్.. భలేటాప్..

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: లాలీపాప్.. భలేటాప్.. అనేలా ఒక వానరం ప్రవర్తించింది. నగరి పట్టణంలోని సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలోని చెట్టుపై ఒక వానరం లాలీపాప్‌ను చిన్న పిల్లలు చప్పరించి తినేలానే తింటూ అందరినీ ఆకట్టుకుంది. కోతులు కూడా అన్నీ తెలిసి మసలుకుంటున్నాయంటూ కోర్టుకు విచ్చేసిన వారు, సిబ్బంది మాట్లాడుకున్నారు.

'ప్రతివారం గళ్ళ పరీక్ష రిపోర్టులు పంపాలి'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి ఆదేశాలతో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ ల్యాబ్ టెక్నీషియన్ల సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఏడి ఏంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లు తప్పనిసరిగా ప్రతి వారం ఒపికి వచ్చేవారిలో 10 శాతం మందికి గల్ల పరీక్ష చేసి రిపోర్టులు పంపాలన్నారు. గల్ల పరీక్షల నమోదు చాలా తక్కువగా ఉందని, కనుక రెండు వారాలు మించి ఉన్న దగ్గు కేసులకు ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా గల్ల పరీక్షించి పాజిటివ్ వస్తే ఆరు నెలల పాటు మందులు , పౌష్టికాహారం ఉచితంగా ఇవ్వాలన్నారు. అలాగే స్పర్శ లేని మచ్చలు అనుమానంగా ఉన్న కేసులను వైద్యాధికారి దగ్గర నిర్ధారణ చేయించి ఉచిత మందులు పంపిణీ చేయాలన్నారు. ప్రతి గురువారం అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. మలేరియా అధికారి మాట్లాడుతూ జూలై నెల డెంగీ నివారణ మాసోత్సవంలో ప్రకటించారు. ప్రతి పీహెచ్సీలో యాక్టివ్, పాసివ్ స్లైడ్స్ (రక్త పరీక్షలు) వారి టార్గెట్ ప్రకారం తప్పనిసరి పూర్తిచేయాలన్నారు. అలాగే ల్యాబ్ పరీక్షలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలి. ఏఎన్ఎమ్స్ అందరికీ ఆర్డిటి కిట్స్ ఇచ్చి అనుమానిత కేసులను పరీక్ష చేసి అవసరమైతే పిహెచ్‌సి రిఫర్ చేయాలని తెలిపారు. అలాగే డెంగీపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, డ్రమ్ములలో నీరు పట్టుకొని మూతలేకుండా ఉంటే దోమల గుడ్లు పెట్టి లార్వా దోమగా తయారై మనుషులను కుట్టడంతో డెంగీ వచ్చే ప్రమాదం ఉందన్నారు. కావున వారంలో ఒకరోజు తప్పనిసరిగా డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ చేపట్టాలని, అపరిశుభ్రతతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముందని, ఇండ్ల పరిసరాలలో నీరు నిలవలేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని, ఫ్రైడే డ్రైడే తప్పక పాటించాలన్నారు. దోమతెరలు వాడాలని, పచ్చి వేపాకు పొగ వేసుకోవాలని తెలిపారు. కాచి వడగట్టిన నీరు తాగాలని, ఎవరికైనా జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే హెల్త్ వెల్నెస్ సెంటర్ నందు లేదా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ నందు లేదా దగ్గరలో ఆరోగ్య కేంద్రం నందు రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కీటక జనీత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, యాక్టివ్, పాసివ్ రక్తపరీక్షల నిర్వహణపై తగుసూచనలు తెలిపారు. పాజిటివ్ వచ్చిన కేసులకు వైద్యాధికారి ద్వారా వెంటనే చికిత్స ప్రారంభించేటట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శివ సుబ్రహ్మణ్యం, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఘాట్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో మంటలు చెలరేగాయి. మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని యాత్రికుల నిర్వాకం మంటలకు కారణమైంది. రాళ్లు పెట్టి పూజ పేరుతో అటవీ ప్రాంతంలో కర్పూరం వెలిగించి వెళ్లారు. ఈ కర్పూరం మంటలకు కారణమైంది. సమాచారం రావడంతో విజిలెన్స్,ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.. 31 వ మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం నైవేద్యం విరామ సమయంలో ఆలయానికి చేరుకున్న ప్రముఖులకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శించుకున్న వారిలో సుప్రీం కోర్ట్ న్యాయమూర్తి విక్రమ్ నాద్, సుప్రీం కోర్ట్ న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఎమ్మెల్యేమైనంపల్లి రోహిత్,మహిళా క్రికెటర్ స్మృతి మందన ఉన్నారు. దర్శనం అనంతరం రంగనాయక మండపంలో ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా, అధికారులు తీర్థప్రసాదాలు అందజేసారు.

అతిథి అధ్యాపక నియామకానికి 4న ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, కంప్యూటర్ అప్లికేషన్‌లో బోధన కొరకు అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థులు నుంచి దరఖాస్తులు కోరుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. రాజనీతి శాస్త్రంలో 55శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఎం ఫిల్, పిహెచ్‌డి చేసిన వారు, కంప్యూటర్ అప్లికేషన్ ఎంసిఎ, ఎంఎస్‌సి కంప్యూటర్స్ పీజీ కలిగిన వారు అర్హులు అన్నారు. ఈ నెల 4వ తేది కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలాన్నారు. ఇంటర్వ్యూలో డెమో ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు రెండవ విడత దరఖాస్తులు

ప్రజాశక్తి-శాంతిపురం: రెండ దఫా ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శాంతిపురం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ జి.నగేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తులు పూర్తి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు దరఖాస్తు ఫారాలతో పాటు ఒరిజినల్ సర్టిఫికేట్‌లను 25 నుంచి 27వ తేదీ లోపల వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అమ్మవారి చీరల వేలం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని శ్రీకృష్ణ ద్రౌపతి సమేత ధర్మరాజుల వారి దేవస్థానం చవటగుంటలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9గంటలకు అమ్మవారి చీరలు వేలం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కావలసిన భక్తులు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

బంగారమ్మకు అభిషేకాలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరంలోని గ్రామ దేవత శ్రీ బంగారమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కే.ప్రసాద్, ఉపాధ్యక్షులు రంగనాథ మొదలి, కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'గ్రీన్ అంబాసిడర్‌లను ఆదుకోవాలి'

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: స్వచ్ఛభారత్ గ్రీన్ అంబాసిడర్ కార్మికులను ఆదుకోని వారికి ఉద్యోగ భద్రత కల్పించి పెండింగ్లో ఉన్న 25నెలలు జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య అన్నారు. మంగళవారం ఎస్ఆర్ పురంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబరు 680 ప్రకారం రూ.10వేల వేతనం ఇవ్వాలని 15ఫైనాన్సు ద్వారా జీతాలు ఇస్తామని చెప్పి ఎప్పటి వరకు చెల్లించలేదన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం అయినా స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గోవిందస్వామి, చంద్రబాబు, హేమాద్రి, అర్పోదాం, మునయ్య, యేసు పాల్గొన్నారు.

'ప్రజల సహకారంతో డెంగీని నిర్మూలిద్దాం'

విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేపడుతున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రజలందరూ సమాజం పట్ల బాధ్యతతో డెంగీ నిర్మూలనకు కృషి చేద్దామని మండల వైద్యాధికారి టి.మురళి అన్నారు. మంగళవారం మండలంలోని నిడిగుంట పంచాయతీలో డెంగీ వ్యతిరేక మాస ఉత్సవాలలో భాగంగా డెంగీ, ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రకాల వ్యాధుల నివారణకు పరిశుభ్రత ముఖ్యమని దోమలను నివారించేందుకు లార్వాలను నిర్మూలించేందుకు నీటి తొట్టెలపై మూతలు తప్పనిసరిగా పెట్టాలని అదేవిధంగా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని స్థానిక విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు పరిశుభ్రత ఆరోగ్యానికి తొలిమెట్టు అని ఆరోగ్యంగా ఉంటూ బాగా చదువుకోవాలని పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యలను బ్యానర్ రూపంలో ప్రదర్శించి విద్యార్థులకు వివరిస్తూ తమ ఇంటిలో తప్పనిసరిగా పాటించే విధంగా తల్లిదండ్రులు కూడా అవగాహన కల్పించాలని అన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఈ నెలాఖరు వరకు డెంగీ వ్యాధి నిర్మూలనకు మండల వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వైద్యాధికారి మురళి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు విస్తృత పర్యటన

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: డెంగీ నివారణకు విస్తృత పర్యటన చేపట్టాలని టెస్టింగ్ సేంపుల్స్ సేకరణకోసం నియమించిన ప్రత్యేక సిబ్బందికి మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి సూచించారు. మంగళవారం సిబ్బంది చేపట్టాల్సిన చర్యలను ఆమె తెలిపారు. డెంగీ నివారణ మాసంలో చేపట్టవలసిన పనులు, ఎస్ఎస్‌హెచ్ ల్యాబ్ సేవల పట్ల చర్చించారు. నగరి రూరల్, నగరి మున్సిపల్ ప్రాంతాల్లో డెంగ్యూ అనుమానిత కేసులను గుర్తించి సెరా సేంపుల్స్ సేకరించి ఎలీసా టెస్టులకు ఆస్పత్రికి పంపాలన్నారు. దోమల ద్వారా మలేరియా, బోద వ్యాధి, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు, ఇతర జ్వరాలు వ్యాపిస్తారని దోమలు నియంత్రణ ముఖ్యమన్నారు. మంచినీటి చెరువుల్లో, గుంటల్లో దోమ పిల్లలను తినే గంబూషియా చేపలను వదలాలన్నారు. మురుగునీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. వారం రోజుల పాటు జ్వరంతో బాధ పడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో గానీ, ప్రైవేటు ల్యాబ్‌లలో గానీ పరీక్షలు నిర్వహించుకునే వారిని గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రమే అందుబాటులో ఉండే ఎలీసా టెస్టులు చేయించాలన్నారు. డెంగీ భారిన పడినట్లు గుర్తిస్తే వారికి నివారణ కిట్లు అందించాలన్నారు.

పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన..

ప్రజాశక్తి-సోమల: పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. డయేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విధంగా పాఠశాలలకు, ఇండ్ల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లనే ఉపయోగించాలని ప్రజలకు సూచించాలన్నారు. అతిసార వ్యాధి వస్తే నివారణ కోసం ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఏ విధంగా నీటిలో కలిపి తాగాలో వివరించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌వో అమర్నాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తుంబకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చంగల్‌రాయలు అన్నారు. మంగళవారం బంగారుపాలెం మండలం తుంబుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్ల మాస సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మురికి కాలువల శుభ్రత, తాగునీటి ట్యాంకర్లను శుభ్రం చేయడం వంటి పనులను పంచాయతీ కార్యదర్శి ఆరోగ్య కార్యకర్తలు ముకుమ్మడిగా చేపట్టాలని సూచించారు. అపరిశుభ్రం ఉంటే వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని వ్యాధి నివారించేందుకు గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా పరిసరాలను శుభ్రతతో ఉంచుకునే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు లోకేష్, సెల్వరాజు మండల ఆరోగ్య సూపర్వైజర్ హరికృష్ణ, ఆముద పలువురు ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'కెనడా డే' పోటీల్లో విజేతలు

ప్రజాశక్తి - క్యాంపస్ : తెలుగు తల్లి కెనడా మాసపత్రిక కెనడా డే సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే అంతర్జాతీయ కవితలు, కథలు పోటీల్లో 2024వ సంవత్సరానికి సంబంధించి తిరుపతి జిల్లాకు చెందిన కవి, కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం కవితల్లో విజేతగా నిలిచారు. వీరితో పాటు కథా రచయిత్రి యంఆర్ అరుణకుమారి రాసిన 'మరుజన్మకు నువ్వే' కథకు, రచయిత రాచపూటి రమేష్ రాసిన 'ఆ నాటి చెలిమి ఒక..' కథకు బహుమతులు వచ్చాయి. పేరూరు బాలసుబ్రమణ్యంకు 2020 'ఆటగదరా శివా!' కథకు, 2023 లో 'ప్రాణ దాతలు' కవితకు బహుమతులు రాగా ఈ ఏడాది మూడవ సారి 'నాన్న!' కవిత బహుమతికి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా వారిని అభ్యుదయ రచయితల సంఘం నేతలు సాకం నాగరాజ, యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, రచయితలు ఆర్‌సికెరాజు, మన్నవ గంగాధర ప్రసాద్, వాకా ప్రసాద్, తదితర సాహితీ ప్రియులు అభినందించారు.

రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం వారో త్సవా ల్లో భాగంగా ఎల్ఐసి ఉద్యోగులు పుత్తూరు ప్రభుత్వ వైద్యశాల రోగులకు వైద్యాధికారి ఉదయ్, ఫార్మసీ అన్నాదొరై, హెడ్‌నర్స్ దిల్ షాద్ చేతుల మీదుగా మంగళవారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఎన్ లక్ష్మణ కుమార్, మాట్లాడుతూ తమ యూనియన్ సామాజిక సేవా కార్యక్రమంలో ఎల్లవేళలా ముందుంటుందని తెలిపారు. ఈ నెల ఐదవ తేదీ శుక్రవారం ఎల్ఐసి కార్యాలయ ఆవరణలో స్విమ్స్, బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదానం చేపడుతున్నారని, ఆసక్తి కలిగిన వారు దస్తగిరి 9949051900, లక్ష్మణ కుమార్ 9440844925 ఫోను నెంబర్లను సంప్రదిం చాలని సూచించారు.

జీవో 117ను రద్దు చేయండి

ఎమ్మెల్యేకి ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: వివిధ విద్యారంగ సమస్యలతో పాటూ జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని, పాఠశాలల విలీనాన్ని రద్దుచేసి పూర్వ స్థితిని కల్పించాలని, ఏకోపాధ్యాయ పాఠశాలను బహుళ ఉపాధ్యాయ పాఠశాలలుగా మార్చాలని కోరుతూ సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకి ఆపస్ నాయకులు మంగళవారం నారాయణవనంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆపస్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించనున్న మెగా డీఎస్సీలో దాదాపు 40 వేల ఉపాధ్యాయ ఖాళీలకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ వల్ల ఖాళీ అయిన సబ్జెక్టు టీచర్ల కొరత స్కూళ్లకు వర్క్ అడ్జెస్ట్ మెంటు కింద టీచర్లను డిప్యూటేషన్ వేయాలని కోరారు. ఈ సమస్యలన్నింటిని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు తూకివాకం నాగరాజు, జిల్లా మీడియా కన్వీనర్ జగదీష్ పా ల్గొన్నారు.

చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని సిడి కండిగ, గ్రామంలో అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు పంపిణీ చేశారు. బూత్ కన్వీనర్ దాసరి గణేష్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం అమలు చేయడం సంతోషదాయకమన్నారు. సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండి అందరికీ పెన్షన్ అందించడం హర్షించదగ్గ విషయం అన్నారు. అనంతరం సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలోలోకనాథ్ శెట్టి, నడిపి రెడ్డి, దాసరి గణేష్, గోవిందస్వామి, దాము, సుబ్బారెడ్డి, కుప్పారెడ్డి, నరేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పింఛన్ అందజేత

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలం లోని మాంబేడు పంచాయతీకి చెందిన ఇరగమ్మకు వికలాంగ పింఛన్ లబ్ధిదారులు. అనారోగ్యంతో తిరుపతి రూయాలో చికిత్స పొందుతుండగా మంగళవారం పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం, మహిళ సంరక్షణ కార్యదర్శి శిరీష రుయాసుపత్రికి వెళ్లి ఇరగమ్మకు పింఛన్ అందజేశారు.

టార్పాలిన్, డ్రమ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-శాంతిపురం: మండలంలోని అబకలదొడ్డి పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చేతుల మీదుగా పిఎంఎజెఎవై పథకం క్రింద రైతులకు టార్పాలిన్, డ్రమ్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఏపీలో చేస్తున్న ప్రకృతి వ్యవసాయం ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయం అన్నారు. కుప్పం నియోజకవర్గంలో అధిక శాతం సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న రైతులు ఉన్నారని అన్నారు. పిఎంఎజెఎవై పథకం క్రింద ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్‌సి రైతులకు వంద శాతం రాయితీపై 18-24 అడుగుల టార్పాలిన్‌లు, ప్లాస్టిక్ డ్రమ్‌ల పంపిణీ కార్యక్రమంను చేపట్టారు. జిల్లాలో 1,205మంది రైతులు లబ్ధిదారులుగా ఎంపిక కాగా కుప్పం నియోజకవర్గంలో 518మంది రైతులు ఎంపికయ్యారని, ఇందులో రూ.5వేలు విలువైన 2 టార్పాలిన్‌లు, రూ.1,830 విలువైన 200 లీటర్ల డ్రమ్ ఒకటి, రూ.1,020 విలువైన డ్రమ్ ఒకటి కలెక్టర్, ఎంఎల్‌సి, జెసి చేతుల మీదుగా మహిళా రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వనాథ్ నాయుడు, ఉదయ్ కుమార్, విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, రమేష్, బాలసుబ్రమణ్యం, వెంకటేష్, మురళి, నవీన్, శ్రీనివాస్ రెడ్డి, అనసూయ, శ్యామలమ్మ, సుగుణమ్మ పలువురు నాయకులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ బోధన షురూ..

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగవ తరగతి విద్యార్థులకు స్మార్ట్ టీవీల ద్వారా విద్యాబోధన చేస్తున్నారు. గత ప్రభుత్వం విద్యార్థులకు డిజిటల్ విధానంలో బోధన జరగాలన్న ఉద్దేశంతో స్మార్ట్ టీవీలను పాఠశాలలకు పంపిణీ చేసింది. దీంతో ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విద్యార్థులకు స్మార్ట్ టీవీ ద్వారా పాఠ్యాంశాలను ఇతర జనరల్ నాలెడ్జి అంశాలను చూపిస్తూ వాటిని వివరించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధిస్తున్నారు. మంగళవారం పాఠశాలలోని నాలుగవ తరగతి విద్యార్థులకు హెచ్ఎం ఎల్లయ్య ఆధ్వర్యంలో స్మార్ట్ టీవీ ద్వారా తెలుగు పాఠ్యాంశాలకు సంబంధించిన తరగతులను నిర్వహించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు పట్టణంలోని పాతపేట డిసి వీధిలో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తాకు చెందిన ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగింది. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, బట్టలు, వంట సామగ్రి, ఇతర గృహోపకరణములు పూర్తిగా కలి బూడిదైనట్లు గిరిధర్‌గుప్తా తెలిపారు. సుమారు రూ.4లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేశారు.

లారీ బోల్తా

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఒక వ్యక్తిని ఢీకొని అతివేగంతో అదుపుతప్పి ఐచర్ వాహనం బోల్తా పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు వివరాల మేరకు.. మంగళవారం పుత్తూరు వైపు నుంచి చిత్తూరుకు ఒక ఐచర్ వాహనంలో గ్లాస్ లోడుతో వస్తుండగా మండల కేంద్రంలో ఒక వ్యక్తిని ఢీకొని మరికొంత దూరం వెళ్లగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహన దారుడు స్వల్ప గాయాల తో బయటపడ్డారని, ఐచర్ వాహనం లోని ముగ్గురు వ్యక్తు లకు ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. గాయపడ్డ ద్విచక్ర వాహనదారుడిని ప్రాథమిక చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం బైరెడ్డిపల్లి నాలుగు రోడ్ల కూడలి వద్ద టీడీపీ నేతలు కిషోర్‌గౌడ, సుబ్రమణ్యం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతామని తెలిపారు. కార్యక్రమంలో రాధా కిషోర్. సుబ్రమణ్యం శెట్టి, గోవింద్ స్వామి, భువనచంద్ర గౌడ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండల వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిలో ఫోటోలు ప్రదర్శించి బాణాసంచా కాల్చి భారీ కేకులు కట్ చేసి వారి ఆనందాన్ని వెలిబుచ్చారు.

పలమనేరు: ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పలమనేరులో టీడీపీ శ్రేణులు, ఆయన అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. పట్టణ కేంద్రంలో కేక్‌లు కట్ చేసి పలువురికి పంచిపెట్టారు.

విద్యార్థులకు నగదు బహుమతి



ప్రజాశక్తి-గంగవరం: చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు టీడీపీ నేతలు నగదు బహుమతిని అందజేశారు. మంగళవారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని గుండుగల్లు పంచాయతీ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పదవ తరగతి చదువుతూ ఎక్కువ మార్కులు సాధించిన అంజలికి మొదటి బహుమతిగా రూ.3వేలు, సమితకు రూ.2వేలు చొప్పున నగదు పంపిణీ చేసినట్లు టీడీపీ నేత జయసింహ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యార్థులందరికీ మిఠాయిలు పంచి పలు సూచనలు ఇచ్చారు.

డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, ఆంధ్రప్రదేశ్, విజయవాడ వారి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ బి.సి. స్టడీ సర్కిల్, తిరుపతి నందు డిఎస్‌సి పరీక్షల ఉచిత శిక్షణకు వెనుకబడిన తరగతులు (బి.సి.) షెడ్యూల్డ్ కులాలు (యస్.సి.), షెడ్యూల్డ్ తెగలకు (యస్.టి) చెందిన అభ్యర్థులు డిఎస్‌సికి ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని, 200 మంది అభ్యర్థులకు ఈనెల 15వ తేదీ నుండి 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్ , స్టడీ మెటీరియల్ అందిస్తామని కలెక్టర్ కార్యాలయం పేర్కొంది. బిఇడి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు బి. ఇది. ప్రొవిజనల్ సర్టిఫికేట్

బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర రావు

10వ తరగతి, ఇంటర్ , డిగ్రీ మార్కులిస్టులు, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ పత్రం (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1లక్ష లోపు మాత్రమే) ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జతపరచి డి. ఎస్సీ అభ్యర్థులు ఈనెల 10వ తేదీ లోపు ఆంధ్రప్రదేశ్ బి.సి. స్టడీ సర్కిల్, 4-171/2, మొదటి క్రాస్, శ్రీకృష్ణ నగర్, ముత్యాలరెడ్డి పల్లి, తిరుపతి నందు మీ దరఖాస్తులు అందించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు నేరుగా కార్యాలయంలో లేదా ఫోన్ నెంబరు 9346221553, 9490733351 , 944145 6039 ఫోను నెంబర్లను సంప్రదించాలన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-శాంతిపురం: శాంతిపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని శాంతిపురం, రామకుప్పం మండలాల్లో ఖాళీగా ఉన్న 2 మినీ కార్యకర్త పోస్టులకు, 3 ఆయా అంగన్వాడి ఆయా పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ కల్పన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శాంతిపురం మండలంలో శ్యామరాజపురంలో మినీ అంగన్వాడి వర్కర్, నక్కనపల్లిలో అంగన్వాడి ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చుని తెలిపారు. 19వ తేదీ లోపు దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

గంగాధర నెల్లూరు: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మండలాల్లో ఖాళీ ఉన్న ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఓ వినతశ్రీ తెలిపారు. ఆమె ఐసిడిఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పెనుమూరు మండలంలోని చిన్న కలికిరి అంగన్వాడి వర్కర్ పోస్ట్(బీసీ-ఎ) పాళ్యం యానాది కాలనీలో మినీ అంగన్వాడి వర్కర్ పోస్ట్ (ఎస్.టి) పుట్టగానిపల్లె మినీ అంగన్వాడి వర్కర్ పోస్ట్ (ఓసీ), కే.గొల్లపల్లి అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఓసీలకు), గంగాధర నెల్లూరు మండలంలోని కలిజవేడు అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఓసీలకు), అగరమంగళం అంగన్వాడీ హెల్పర్ పోస్ట్ (ఎస్సీలకు), కే.వెంకటాపురం దళితవాడలో అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఎస్సీలకు), కోటాగరం దళితవాడలో అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఎస్సీలకు) తూగుండ్రం పంచాయతీ దాసర పల్లె అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఓసీలకు), తిరువీధి కుప్పం అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఓసీలకు) ఖాళీలకు బిసి కులాలవారు కులం, వివాహ ధ్రువీకరణ పత్రాలను విద్యార్హత సర్టిఫికెట్లు వికలాంగులు కలిగిన వారు సంబంధిత సర్టిఫికెట్లు జిరాక్స్‌లపై గెజిట్ అధికారి అటెస్టేషన్ సంతకాలు చేసుకోవాలని కోరారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తును ఈనెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా గంగాధర నెల్లూరు ఐసిడిఎస్ కార్యాలయంలో చేర్చాలని ఆమె కోరారు. అంగన్వాడి పోస్టులకు దరఖాస్తు చేసుకోండి.

పెద్దపంజాణి: చిత్తూర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని పలమనేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని మద్దలకుంట అంగన్వాడి సెంటర్లో కార్యకర్త ఓ.సి, శివాడి అంగన్వాడి సెంటర్లో సహాయకురాలు పోస్టు ఖాళీగా ఉన్నాయని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

జాతీయ ఆర్చరీ పోటీలకు మేధాసింగ్ ఎంపిక

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూలు పాఠశాల విద్యార్థిని మేధాసింగ్ జాతీయ ఆర్చరీ పోటీ లకు ఎంపికైందని ఆ పాఠశాల ప్రిన్సిపల్ శ్రావణి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జూన్ 24వ తేదీ విజయవాడలో నిర్వహించిన అండర్- 13 విభాగంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలలో పాల్గొని జాతీయ స్థాయికి తమ పాఠశాల విద్యార్థిని మేధాసింగ్ ఎంపికైందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని మేధా సింగ్‌ను అభినందించారు. చిన్న వయసులోనే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషమని తెలిపారు. ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ధన్య వాదాలు తెలిపారు. మేధా సింగ్ భవిష్యత్తు లో మంచి స్థాయికి చేరు కోవాలని ఆకాంక్షించారు. ఆమెకు పాఠశాల తరపున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొదుపుపై అవగాహన కల్పించాలి: ఏపీఎం

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో పొదుపు సంఘాలు సభలు పెట్టి పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వెలుగు ఏపీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉన్న స్త్రీ శక్తి భవనంలో పొదు పు సంఘాల పై సమీక్ష సమావేశం నిర్వహించా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి సభలో నిర్వహించలేదని వెంటనే ప్రతి గ్రామాల్లో పొదుపు సభ్యులు నిర్వహించి ఇప్పటివరకు ఎంతమంది బ్యాంకుల ద్వారా రుణాలు పొందారు? వారి వద్ద నుంచి వెంటనే రికవరీ చేయించే బాధ్యత విఓ ఏలు పైన ఆధారపడి ఉందని తెలిపారు. అంతేకాకుండా పొదుపు సంఘాల్లో మొండి బాకీలు ఉంటే వారికి సబ్సిడీ వర్తించదని గ్రామసభలో తెలిపి వాళ్ళ వద్దకు వెళ్లి వెంటనే రికవరీ చేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వర్సిటీలలో బోధనేతర సిబ్బంది వయస్సు పెంచండి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో పనిచేసే బోధనేతర సిబ్బంది వయసును 60 నుంచి 62 ఏళ్ల వరకు పెంచాలని కోరుతూ విశ్వవిద్యాలయాల బోధనేతర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మంగళవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాల జీవోను గవర్నమెంట్ ఉద్యోగస్తులకు ఇంప్లిమెంట్ చేసిన నాటి నుండి అనగా 1.1.2022వ సంవత్సరం నుండి విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్నటువంటి ఉద్యోగస్తులకు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పీకే సుబ్రహ్మణ్యం, రవి కుమార్, పాల్గొన్నారు.